# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## మోటర్లు ఎవ్వలియ్యాలే..



ఆసిఫాబాద్ టౌన్,నవంబర్ 25: కాంగ్రెస్ గెలుసుడు ఉత్త ముచ్చట. గీ కాంగ్రెస్ లీడరు రేవంత్ రెడ్డి టెన్ హెచ్‌పీ మోటర్ పెట్టుకొమ్మంటున్నడు. పొలాలకు 10 హెచ్‌పీ మోటర్లు తేవాలంటే ఎంత ఖర్చు పెట్టాలె. ఎవ్వరు ఇయ్యాలే. ఎవుసం మీద సోయి ఉండే మాట్లాడుతుండా..? సామాజిక పరిస్థితులు తెలియని వ్యక్తికి పరిపాలన ఇస్తే ఇగ ఆగమవుడే. గిట్లాంటోళ్లకు ఓట్లు వేస్తే మళ్లీ మన బతుకులు మొదటికే వస్తయి.గతంలో ఏం చేసింర్రని వీళ్లను గెలిపించాలె. అసలే కరెంట్ ఉండకపోతుండె. ఉన్నట్టుండి ఒకసారి మా మోటర్లు కాలిపోవుడు. మంచి చేసిన కేసీఆర్ సారే మల్లి సీఎం పక్కా. నాడు సమైక్య రాష్ట్రంలో రాత్రి పూట కరెంటు ఇచ్చేటోళ్లు. ఆ ఇచ్చిన కరెంటుతో పొలమంతా సరిగా పారేది కాదు. ఇప్పుడు తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఎవుసానికి 3 గంటల కరెంటు సాలు.. 3 గంటల్లో పొలం అంతా పారుతదన్నడు. ఇగ ఈయన మాటలకైతే అంతే లేదు. గిసోంటళ్లను మన నెత్తి మీద పెట్టుకుంటే మళ్లీ ఏడుపులే మిగులుతుయ్. దేవునసోంటి కేసీఆర్‌నే మనం కాపాడుకోవాలె. గెలిపించుకోవాలె.

**- దాసరి మల్లేశ్, గొల్లగూడ, ఆసిఫాబాద్**

## 24 గంటల కరెంట్‌తోనే లాభం..



జైనూర్, నవంబర్ 25 : తెలంగాణ ప్రభుత్వం 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇస్తునందుకు ప్రధానంగా వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నాం. ముఖ్యంగా మండలంలోని జామిని, గౌరీ, పొలాస తదితర గ్రామాల్లో 3ఫేజ్ కరెంటు సదుపాయం ఎప్పుడు ఉంటుంది. మూడు దఫాలుగా పంటలు సాగు చేసి ఆర్థికంగా లబ్ధిపొందుతున్నా. నా చేనులో జామపండ్లు, సీతాఫలం 300 చెట్లు నాటి సాగు చేస్తున్నా. కోత దశలో ఉంది. మార్కెట్‌లో అమ్ముకుంటున్న. ఇదంతా బీఆర్‌ఎస్ ప్రభుత్వ పుణ్యం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వరుసగా కరెంటు కోతలు ఉండేవి. అప్పట్లో ఐదేండ్లు టమాట పంటలో నష్టం జరిగింది. ఇప్పుడు కరెంటు కోత లేదు ఎప్పుడు పడితే అప్పుడు మోటరు ఆన్ చేసి, చెట్లకు నీరందిస్తున్నం. వ్యవసాయాధికారి సూచనలతో కేసీఆర్ దయతో ఏడాదికి సుమారు రూ.2 లక్షలు ఆదాయం వస్తున్నది. బీఆర్‌ఎస్ రైతులకు ఏమాత్రం తక్కువ చేయలేదు. ఆర్థికంగా ఆదుకునేందుకు రైతులపై ప్రత్యేక దృష్టిసారించిన కేసీఆర్‌ను రానున్న ఎన్నికలోల గెలిపించుకుంటం. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మం. మాకు కేసీఆర్ సారే మంచి చేసిండు. అయనకే ఓటు వేస్తాం.

**- డోంగ్రె సమాధాన్, జామ్ని, జైనూర్ మండలం**

# కాంగ్రెస్‌ను నమ్మం..

- చేతిపార్టీ లీడర్ల వి దగాకోరు మాటలన్న రైతులు
- మూడు గంటల కరెంట్‌పై ఆగ్రహం

*ఎన్నికలు వచ్చినయని కాంగ్రెస్ లీడర్ల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు గంటల కరెంట్, టెన్ హెచ్‌పీ మోటర్లు, ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామనే వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. కాంగ్రెసోళ్లు, గెలిచేది లేదు.. సచ్చేది లేదని ఎద్దేవా చేస్తున్నారు. వీళ్లను నమ్ముకుంటే మోటర్లకు మీటర్లు పెడుతరని, రైతులను మళ్లీ ఆగం చేస్తరని చెబుతున్నరు. మళ్లీ పచ్చని పల్లెల్లో పగలు పెంచుతరని వాపోతున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి దారుణంగా ఉందని విమర్శించారు. అందుకే పదేళ్లుగా రాష్ట్రంలో 24 గంటల కరెంటుతో పాటు రైతులకు అన్ని వనరులు సమకూరుస్తున్న సీఎం కేసీఆర్‌కే అండగా ఉంటమని చెబుతున్నారు.*



### ధరణితోనే రైతు బంధు

బెజ్జూర్, నవంబర్ 25 : రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేసీఆర్ భూముల లెక్కా పక్కా మంచిగుండాలని ధరణి తెచ్చి ఎకరాకు రూ.10 వేల సాయం ఇస్తున్నరు. కాంగ్రెసోళ్లు ధరణిని తీసెయ్యాలని ఎట్ల అనగలుగుతున్నారు. ధరణితో ఎంతో మేలున్నది. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతమని పిచ్చి పిచ్చి మాట్లాడుతున్నరు. కాంగ్రెసోళ్లను నమ్ముకుంటే ముందుగనే మునిగిపోతం. ధరణి కంటే మంచి విధానం నాకు తెలిసీ లేదు. కాంగ్రెసోళ్లకు ఎద్దెరుకనా.. ఎవుసం ఎరుకనా.. వీళ్లకు ఏం పట్టదు. వీళ్ల కడుపులు నిండితే చాలనుకుంటరు. రైతులకు అన్యాయం చేసుడే వీళ్ల పని. గతంలో ఎన్నో ఇబ్బందులైనయ్.

**- అబీద్ ఖాన్, (కుకుడ) బెజ్జూర్ ( ధరణి)**

### గెలిచేది లేదు.. సచ్చేది లేదు



ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 25: కాంగ్రెస్ నాయకులది అంతా సోషల్ మీడియా వరకే. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఉత్తి ఊకదంపుడు మాటలు. గతంలో వాళ్ల హయాంలో కరెంట్ ఎట్లుండేదో రైతులకు తెల్వదా.. మళ్లా వాళ్ల జోలికి పోతరా.. కాంగ్రెసంటనే రాత్రి నిద్రల ఉలికి పడి లేసినోళ్లం. ఇంకా ఆ పార్టీకి ఓటెత్తే మళ్లీ గా రోజులే వస్తయ్. రైతులను అరిగోస పెట్టుకున్నరు. గిప్పుడచ్చి నీతులు చెప్పినంత మాత్రాన ఓట్లు పడుతయనుకుంటున్నరు. రైతులకు ఇబ్బంది లేకుండా చేసింది కేసీఆర్ సారు. 24 గంటల కరెంటిస్తున్నడు. గా రేవంత్ రెడ్డి మూడు గంటలే ఇస్తనని అంటున్నడు. గందుకే ఆయనను నమ్మేది లేదు. మళ్లా సీఎం కేసీఆరే ముఖ్యమంత్రి.

**- కవాల్కర్ గణపతి అంకుసాపూర్**



### స్లాట్ బుకింగ్‌తోనే పట్టాలు అయితున్నయ్..

బెజ్జూర్, నవంబర్ 25 : ధరణిలో భూములు పట్టా చేసుకోవడం చాలా సులువుగా మారింది. అమ్మేవారు, కొనేవారు ఇద్దరు ఉండి మీసేవలో స్లాట్ బుక్ చేస్తే చాలు పట్టాలు అయిపోతున్నయ్. లంచాలు, రిజిస్ట్రేష్లన్ల కోసం దూర ప్రాంతాలకు పోవడం కూడా తప్పింది. స్లాట్‌బుక్ చేసిన తరువాత ఇచ్చిన తేదీ ప్రకారం తహసీల్ ఆఫీస్‌కు పోతే చాలు డాక్యుమెంట్లు చూసి తహసీల్ భూములను పట్టా చేసి పాస్‌బుక్ ఇంటికే పంపుతున్నరు. ఎంత సులువుగా మారిందోనని రైతులు చాలా సంబుర పడిపోతున్నరు. గతంలో పట్వారీల నుంచి మొదలు పెడితే ఎమ్మార్వో దాకా లంచాలు ఇస్తేగానీ పట్టాలు మారేవి కావు. మారినా పట్వారీలు రికార్డుల్లో పేర్లు ఎప్పుడు తీసి ఇతరుల పేర్లు ఎప్పుడు పెడ్తరో భయం భయంగా ఉండేది. ధరణి వచ్చినాక గీ ఇబ్బందులన్నీ పోయినయ్.

**- దుర్గం లాంచు, (కుకుడ) బెజ్జూర్(ధరణి)**



### కాంగ్రెస్ పాలనొద్దు.. వాళ్ల పథకాలొద్దు..

జైనూర్, నవంబర్ 25 : మాకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నిటికీ మంచిగా చేసింది. ఈ ప్రభుత్వం ఉన్నందున మేము చాలా చాలా సంతోషంగా కాలం గడుపుతున్నాం. వ్యవసాయం బాగా చేస్తున్నాం. కరెంటు సరిగాలేక ఇంతకు ముందు వ్యవసాయం సరిగా లేకపోవడంతో దళారుల వద్ద కూలీకి వెళ్లాం. ఫ్యాక్టరీలకు వెళ్లి పిల్లాపాపలతో పనిచేశాం. అనేక తంటాలు పడ్డాం. ఇబ్బందులు ఎదుర్కొన్నం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కష్టాలు దూరమయ్యాయి. ఇప్పుడు 24గంటలు కరెంటు ఉచితంగా ఇస్తున్రు. ఆనందంగా బతుకుతున్నం. ఇప్పుడు కాంగ్రెసోళ్లు మళ్లా 3 గంటల కరెంటే ఇస్తమంటున్రు. అట్లైతే మళ్లా పాత బతుకులే. ఈ ఎలక్షన్లో బీఆర్‌ఎస్ కారు గుర్తుకే ఓటేస్తాం .కాంగ్రెస్‌ని ఇంతకు ముందు చూసినం కాంగ్రెస్ ప్రభుత్వం వద్దు వాళ్ల పథకాలు వద్దు..

**- కేంద్రె సదాశివ్, జామ్ని, జైనూర్ మండలం**



### రైతు బతుకు ఆగం పట్టిస్తరు..

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 25 : కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ రైతు బతుకు ఆగం పట్టిస్తరు. మూడు గంటల కరెంటు చాలని మాట్లాడినోళ్లకు అస్సలు బుర్రుందా అని డౌటస్తున్నది. గతంలో గిట్లనే చేసి ఎన్నో జీవితాలు ఆగం చేసింర్రు. హామీలు ఇచ్చుడు వరకే కాంగ్రెస్ లెక్క. ఇగ మళ్లా తీరుస్తరనే నమ్మకం ఉండదు. గిప్పుడు ఎన్నికలప్పుడు మళ్లీ కల్లబొల్లి మాటలు చెబుతున్నది. అవి నమ్మితే తెలంగాణ రైతుల బతుకు ఆగమైతది. 10 హెచ్‌పీ మోటర్‌తో గంటల ఎకరం పారించవచ్చని రేవంత్‌రెడ్డి అంటున్నడు. అంటే ఇగ రైతును ముంచేందుకు గిప్పటి నుంచే కాంగ్రెసోళ్లు ప్లానేసిన్రు. కాంగ్రెస్, బీజేపీ మాటలు వింటే నిండా మునుగుడే అయితది. ఎవుసం వెనక్కి పోతది. రైతులను అన్ని విధాలుగా ఆదుకునే సీఎం కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలి.

**-కే మంగళ , బాబాపూర్**